నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | NIRMAL

## బాధితులకు అండగా సైబర్ వారియర్స్

- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం


సైబర్ వారియర్స్‌తో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, ఏప్రిల్ 4 : సైబర్ క్రైమ్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక్కొక్కరి చొప్పున సైబర్ వారియర్స్‌ను కేటాయించామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కి ప్రత్యేకంగా ఒక సెల్‌ఫోన్, సిమ్ కార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీసీఆర్బీ సీఐ ప్రసాద్, సైబర్ రియాజ్ పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా చేపట్టాలి..

- బావి దగ్గరకు రాకుండా ఇంటివద్దే అందించాలి..
- ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

ఎదులాపురం, ఏప్రిల్ 4 : ప్రతి గ్రామానికి పక్కా ప్రణాళికతో రెండు నెలలు తాగునీటి సరఫరా చేపట్టాలని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ.. నీటి సమస్య ఉన్న చోట ట్యాంకర్లతో సరఫరా చేయాలని, ఆదిలాబాద్ రూరల్, తాంసి, తలమడుగు, ఇంద్రవెల్లి, బోథ్, బజార్‌హత్నూర్ మండలాల్లో సమస్య అధికంగా ఉన్నచోట ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పంచాయతీ అధికారి, డీఎల్‌పీవో, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి రోజు ఫీల్డ్‌లో ఉండి నీటి సమస్యను గుర్తించి డైరీలో రాయాలన్నారు. బోర్ వెల్స్, మిషన్ భగీరథ పథకంలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రతిపాదనలను సోమవారం లోగా పంపాలన్నారు. గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు.


మాన్కపూర్‌కు మట్టి రహదారి


రాళ్లు, రప్పలతో ఇంద్రనగర్‌కు వెళ్లే రోడ్డు


గిరిజాయి గ్రామానికి బండరాళ్లపై నుంచే ప్రయాణం


డేద్రా గ్రామానికి వెళ్లే రోడ్డు..

# రాళ్లు రప్పలే.. రహదారి

- కంకర తేలిన, మట్టి రోడ్లపైనే ప్రయాణం
- కాలినడకన, ఎడ్లబండ్లపై సంతకు..

### నిత్యం నరకం..



*ఓట్ల కోసం రాజకీయ నాయకులు మా గ్రామాలకు వస్తున్నారే తప్ప.. మా సమస్యలను పట్టించుకున్న నాథుడే లేడు. రోడ్డు వసతి లేక బండరాళ్ల దారిలో నిత్యం రాకపోకలు సాగిస్తూ నరకయాతన అనుభవిస్తున్నాం. మా గ్రామంలో ఎవరికైనా ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని మండల కేంద్రానికి ఎడ్లబడ్లపై చేరుకుంటున్నాం. అదే మా గ్రామానికి రోడ్డు వసతి ఉంటే 108 వాహనం మా గ్రామం వరకు వచ్చేది. మా గ్రామానికి వచ్చిన నాయకులు ఇగో రోడ్డు వస్తాది.. అగో రోడ్డు వస్తాది. అని కాలం వెళ్లాదిస్తున్నారే తప్పా రోడ్డు వచ్చిందిలే.*

**- దుర్వ గుండేశ్, గ్రామస్తుడు, డేద్రా.**

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 4 : మండలంలో 30 పంచాయతీలు ఉన్నాయి. మారుమూల గిరిజన కొండ గ్రామాలైన మాన్కపూర్, డేద్రా, గిరిజాయి, ఉమార్ద, బంధునాయక్ తండా, ఇంద్రనగర్, చినిమియాతండా, శ్యాంరావుగూడ, రతన్‌గూడ, రాజులగూడ, హర్కయి వంటి గ్రామాల పరిధిలో 2,487 జనాభా ఉన్నారు. ఈ గ్రామాలవాసులకు కనీసం రహదారి సౌకర్యం లేకపోవడంతో రాళ్లు రప్పలు, బండరాళ్లు, మట్టి రోడ్డుపై ప్రయాణం సాగిస్తున్నారు. మండల కేంద్రం, సంతకు వెళ్లాలంటే కాలినడక, ఎండ్లబండ్లపై వెళ్తున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.

**ఊరు చేరాలంటే వాగు దాటాల్సిందే..**

గిరిజాయి, ఉమార్ద, బద్దునాయక్‌తండా, కొత్తపల్లి గ్రామాల ప్రజలు వానకాలంలో వాగులు, వంకలు దాటితే తప్పా ఊరు చేరుకోలేము. వంతెనలు నిర్మించకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు, వ్యవసాయ విత్తనాలు, ఎరువులు, రేషన్ సరుకులు తీసుకొచ్చుకోవడానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాలి. ఎండ్లబండి, ఊరంతా కలిసి ఒక ట్రాక్టర్ కిరాయి తీసుకుని సరుకులు తెచ్చుకుంటారు. బంధువుల ఊళ్లకు వెళ్లి రాత్రి అయితే మండల కేంద్రంలోనే ఎక్కడైనా తలదాచుకుని తిరిగి ఉదయం కాలిబాట పట్టె పరిస్థితి. ఇగ, నిండు గర్భిణులు అయితే ప్రసవ వేదన అనుభవించాల్సిందే. కిలోమీటర్ల ప్రయాణం చేసి దవాఖానలకు చేరుకోవాలి. ఒక్కో సందర్భంలో ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే. కాంగ్రెస్ సర్కారు తారు రోడ్డు వసతి కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.


విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


దవాఖాన వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

## విద్యార్థులకు పరామర్శ

- మధ్యాహ్న భోజనం వికటించిన ఫలితం
- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 4 : నర్సాపూర్(జి) పరిధిలోని కేజీబీవీలో మధ్యాహ్న భోజనం వికటించి బుధవారం రాత్రి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరికి నిర్మల్ వైద్య కళాశాల హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. ఇప్పటివరకు 26 మంది విద్యార్థులు దవాఖానలో చేరగా.. వీరికి అత్యవస చికిత్స అందిస్తున్నారు. సూపరింటెండెంట్ సునీల్, వైద్య బృందం విద్యార్థులకు అత్యవసర సేవలు అందిస్తున్నారు. గురువారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. శ్రీహరిరావు పాఠశాలను కూడా సందర్శించి ఘటనపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందిని వారు ఆదేశించారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి ఆసుపత్రిలో అందుబాటులో ఉండి విద్యార్థులకు వైద్య సేవలు అందేలా పర్యవేక్షిస్తున్నారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..**

నర్సాపూర్(జి) కేజీబీవీ పాఠశాలలో భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేపట్టారు. పాసిపోయిన పప్పును వేడిచేసి మళ్లీ విద్యార్థులకు పెట్టడం వల్ల అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. మంగళవారం రాత్రి నుంచే విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అయ్యాయని వారు పేర్కొన్నారు. విద్యార్థులను పరామర్శించేందుకు ఆసుపత్రికి వచ్చిన కలెక్టర్ సరైన సమాధానం ఇవ్వకుండానే వెళ్లిపోయారని నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కేజీబీవీ ఎస్‌వో, హెడ్ కుక్ తొలగింపు**

నర్సాపూర్(జి) కేజీబీవీలో బుధవారం జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విధితమే. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సునీత, హెడ్‌కుక్ పద్మలను విధుల నుంచి తొలిగించినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. అస్వస్థత సమాచారాన్ని అధికారులకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహించిన సెక్టోరల్ అధికారిణి శ్రీదేవికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సునీత, పద్మలపై క్రిమినల్ కేసుల నమోదుకు ఎంఈవో ఆదేశించినట్లు పేర్కొన్నారు. కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేక అధికారిణిగా అక్కడ పనిచేస్తున్న పీజీ సీఆర్టీ వనితను నియమించినట్లు తెలిపారు.

## అంతర్రాష్ట్ర నకిలీ వీసా ముఠా అరెస్టు

- విదేశాలకు పంపిస్తామని మోసం
- ఫేక్ వీసాతో రూ.2.65 లక్షలు వసూలు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 4 : అమాయకులు, నిరుద్యోగులను ఆసరా చేసుకుని విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ వీసాలు సృష్టించి మోసం చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీసాన రాజేశ్‌కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పెగ్గర్ల చంద్రశేఖర్‌లు ఇద్దరు స్నేహితులు. వీరిద్దరు కూడా కరీంనగర్‌లోని రేకుర్తిలో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వీరి గది పక్కనే నిర్మల్ జిల్లా సోన్, నిర్మల్, సారంగాపూర్ యువకులు కూడా కిరాయికి ఉంటున్నారు. ఈ ముగ్గురు యువకులు ఉద్యోగ వేటలో ఉండగా.. రాజేశ్‌కుమార్, చంద్రశేఖర్‌లు చాయ్ హోటల్‌లో పరిచయం అయ్యారు. మేము ఆర్మీ ఆఫీసర్స్‌మని నకిలీ స్టాంప్స్ తయారు చేసుకుని ఈ యువకులను విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మ బలికారు. ఈ ముగ్గురు యువకులు ఇంటికి వచ్చినా తరచూ ఫోన్ చేస్తూ ఉండేవారు. వీసా కోసమని రూ.2.65 లక్షలు ఫోన్ పే చేయించుకున్నారు. కడ్తాల్ యువకుని నుంచి రూ.1.25 లక్షలు, నిర్మల్ యువకుని నుండి రూ.70 వేలు, అలూర్ యువకుని నుంచి రూ.70 వేలు తీసుకుని ఫేక్ వీసాలు పంపించారు. బాధితులు మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సోన్‌లో రాజేశ్‌కుమార్, చంద్రశేఖర్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 11 సిమ్ కార్డులు, ఆర్మీ డ్రెస్, బ్యాంకు పాస్ బుక్‌లు, చెక్ బుక్‌లు, రూ.2,500 నగదు, మొబైల్ ఫోన్, ప్రామిసరీ నోట్, ఫోర్జరీ వీసా జిరాక్స్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

## మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవండి..

ఎదులాపురం, ఏప్రిల్ 4 : కాలం చెల్లిన సిద్ధాంతాలతో కూడిన పార్టీని వీడి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధికి సహకరించాలని డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. బోథ్ మండలం పొచ్చెర గ్రామానికి చెందిన మైలారపు అడెల్లు, అలియాస్ భాస్కర్.. బజార్‌హత్నూర్ మండలంలోని డెడ్రా గ్రామానికి చెంది దాసరి వార్ సుమాన్ అలియాస్ సంగీతక్క వీరు జనంలోకి రావాలని, సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి ప్రతిఫలాలను అందజేసి, పునరావాసం కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు.

## జాకెట్ ధరించి దేశీదారు రవాణా

- రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు


జాకెట్‌లో దేశీదారు బాటిళ్లను చూపుతున్న సత్యనారాయణ

ఎదులాపురం, ఏప్రిల్ 4 : వినూత్న పద్ధతిలో దేశీదారు రవాణా చేస్తున్న వ్యక్తిని ఆదిలాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా మునీశ్వర్ సత్యనారాయణ అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. గమనించిన పోలీసులు అతనిని పట్టుకుని తనిఖీ చేశారు. చొక్కా లోపల ఒక జాకెట్ ధరించి అందులో 48 దేశీదారు బాటిళ్లు ఉంచాడు. సత్యనారాయణ ఆదిలాబాద్ మండలం భీంసరి గ్రామానికి చెందిన వాడు. దేశీదారును మహారాష్ట్ర నుంచి జిల్లాకు తీసుకొస్తున్నట్లు తెలిపాడన్నారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ అక్బర్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుళ్లు రవి, సాయి, కానిస్టేబుళ్లు సందీప్, ఈశ్వర్‌లు పాల్గొన్నారు.

## రూ.1.42 లక్షలు సీజ్

జైనథ్, ఏప్రిల్ 4 : పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ చెక్‌పోస్టులతోపాటు జైనథ్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిజాంపూర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఆవల్‌పూర్ గ్రామానికి చెందిన ఇత్తడి సుశాంత్‌రెడ్డి కారులో రూ.1.42 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రేమ్‌సింగ్, వీడియో గ్రాఫర్ చంద్రశేఖర్, డ్రైవర్ జహీర్ పాల్గొన్నారు.

**కుంటాల మండలంలో..**

కుంటాల, ఏప్రిల్ 4 : కల్లూరు జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. భైంసా నుంచి లోకేశ్వరం వెళ్తున్న వాహనంలో రూ.63,500 ఆధారాలు లేకపోవడతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘుజనీకాంత్ తెలిపారు.

## నీటి ఎద్దడిని నివారించాలి

- జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్



నీటి ఎద్దడిపై సమీక్ష చేస్తున్న ప్రశాంత్ జీవన్ పాటిల్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 4 : తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి, నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి గురువారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులను నియమించి రోజు పర్యవేక్షణ చేయాలని సూచించారు. మిషన్ భగీరథ, బోరుబావులు, చేతిపంపులను ప్రత్యేకంగా గమనించి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నీటి పంపులకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మిషన్ భగీరథకు అవసరమయ్యే నీరు ప్రాజెక్టుల్లో ఉందని, అధికారులు రోజు పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. నీటి ఎద్దడి నివారణకు జిల్లా యంత్రాంగం రెండు నెలలపాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

## శాంపిల్ సర్వే ప్రారంభం


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో

ఎదులాపురం, ఏప్రిల్ 4 : నేషనల్ అయోడిన్ డెఫిసియెన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని 30 గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులకు శాంపిల్ సర్వే ప్రారంభించామని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పుత్లిబౌలి యూపీహెచ్‌సీ పరిధిలోని బ్రహ్మణవాడలో గల పాఠశాలలో కొనసాగుతున్న శాంపిల్ సర్వేను డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని 30 గ్రామాల్లో పాఠశాలలో ఐదు నుంచి పదో తరగతి వరకు చేయబడుతున్న శాంపిల్ సర్వేను పకడ్బందీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో 90 మంది విద్యార్థులకు థైరాయిడ్ పరీక్షలు చేసి వారు వారి ఇంట్లో వాడే ఉప్పును సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపడం జరుగుతుందన్నారు. 30 గ్రామాల నుంచి 2,700 మంది విద్యార్థులను పరీక్షలు చేస్తామన్నారు.

## జొన్న కొనుగోళ్లపై సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఏప్రిల్ 4 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అధికారులు, కొనుగోలు కమిటీ సభ్యులు, వ్యవసాయ, మార్కెటింగ్, సహకారం, మార్క్‌ఫెడ్ అధికారులతో కలెక్టర్ రాజర్షి షా జొన్న కొనుగోళ్ల కోసం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జొన్న పంటను బయట మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

## రైస్‌మిల్లు తనిఖీ


గంజాల్ రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

సోన్, ఏప్రిల్ 4 : మండలంలోని గంజాల్ రైస్‌మిల్లును గురువారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైస్‌మిల్లర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మిల్లింగ్ ప్రక్రియ, ధాన్యం నిల్వలు, శుభ్రతను పరిశీలించారు. ప్రతి మిల్లును తనిఖీ చేసి, నివేదికలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్‌వో నందిత పాల్గొన్నారు.